క్లుప్తంగా

అన్నసమారాధనకు వితరణ



శ్రీకృష్ణుని విగ్రహానికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రరాజు

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం మల్లవరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పిన్నమరాజు రవీంద్రరాజు రూ.10వేలు విరాళం అందజేశారు. అన్నసమారాధనకు తనవంతు సాయంగా శ్రీకృష్ణ యాదవ సంఘ సభ్యులకు ఈ విరాళం అందించారు. అనంతరం శ్రీ కృష్ణుని విగ్రహాన్ని ఆయన దర్శించుకుని పూజలు చేశారు.

కొండకర్లలో లారీ బోల్తా



కొండకర్ల వద్ద బోల్తా పడిన లారీ

మునగపాక(అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం కొండకర్ల వద్ద సోమవారం లారీ బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు లోడుతో ఓ లారీ వెళ్తుంది. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

వాడ్రాపల్లిలో క్రీడా పోటీలు



వాడ్రాపల్లిలో ఆటల పోటీలు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో సోమవారం పలు ఆటల పోటీలు నిర్వహించారు. పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీలను వ్యాపారవేత్త కొయిలాడ దశావతారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు, కమిటీ అధ్యక్షుడు మళ్ల జోగినాయుడు, కాండ్రేగుల శ్రీను, లీలా భాస్కరరావు, దాడి గణేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో జార్ఖండ్ వాసి మృతి

రాంబిల్లి(యలమంచిలి): అనారోగ్యంతో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రం బకోరో జిల్లా నబారీ మండలానికి చెందిన జగన్నాథ్ ఖంజు(25) గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడు రాంబిల్లి మండలంలో ఒక ప్రైవేట్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడని, పూర్తి వివరాలు తెలుసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వెలుగు సీసీ మృతికి సంతాపం



సీతంనాయుడు(ఫైల్)

కె.కోటపాడు : కె.కోటపాడు వెలుగు పథకంలో క్లస్టర్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సీతంనాయుడు(53) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. స్వగ్రామం సబ్బవరం మండలం టెక్కలిపాలెంలో వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్న సమయానికి మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. మండలంలో క్లస్టర్ కోఆర్డినేటర్‌గా ఐదేళ్లుగా పనిస్తున్న సీతంనాయుడు అంకిత భావంతో విధులు నిర్వహించి అధికారుల మన్ననలు పొందారు. ఆయన మృతికి వెలుగు పెందుర్తి ఏరియా కోర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం వెంకటలక్ష్మి, సీసీలు వెంకటరావు, సూర్యనారాయణ, సురేష్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీతంనాయుడు అంత్యక్రియలకు వెలుగు ద్వారా రూ.25వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు.

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



కోల్‌కతా ఘటన పునరావృతం కాకుండా రాష్ట్రంలో మహిళా వైద్యుల కోసం ఆస్పత్రుల వద్ద పోలీసులతో రక్షణ కల్పించాలి. ముఖ్యంగా డ్రెస్సింగ్ రూమ్, రెస్ట్ రూమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యుల రక్షణకు సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఉంది. వైద్యులు, సిబ్బంది భద్రతకు ప్రోటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడడం సంతోషం. విధి విధానాల రూపకల్పనకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. మహిళలు పనిచేసే అన్ని ప్రాంతాల్లోనూ భద్రతకు చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ ఆర్.నిహారిక, అసిస్టెంట్ సివిల్ సర్జన్, యలమంచిలి సీహెచ్‌సీ

విధి నిర్వహణలో భద్రత అవసరం



ఎక్కడో దూర ప్రాంతాల నుంచి వచ్చి రేయింబవళ్లు వైద్య సేవలు అందిస్తున్న తమకు భద్రత కల్పించకపోతే విధి నిర్వహణ కష్టమే. మా ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. రోగుల ఆరోగ్యం కాపాడటమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తుంటాం. ఒక్కోసారి రోగితో పాటు వచ్చే బంధువులు తమపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. ఇటువంటి ఘటనలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడి చేస్తే కఠినంగా శిక్షించే చట్టాలు అమలు చేయాలి.

– డాక్టర్ మౌనిక, వైద్యురాలు, ఏరియా ఆస్పత్రి నక్కపల్లి

- యలమంచిలి రూరల్/నక్కపల్లి

వదలని వయ్యారిభామ..!

- ఎక్కడికక్కడ ఏపుగా పెరిగిన కలుపు మొక్క
- పంటలకు నష్టాన్ని కలిగిస్తున్న వైనం



పంట పొలాల్లో ఏపుగా పెరిగిన వయ్యారిభామ కలుపుమొక్కలు

కోటవురట్ల: వయ్యారిభామ.. ఈ పదం వినగానే ఇదేదో ఎవరినో పిలిచినట్లు అనిపించిందా.. లేదంటే ఎవరినో వర్ణించారని అనుకుంటున్నారా.. కాదండోయ్ అలా అనుకుంటే పెద్ద పొరపాటు చేసినట్టే.. వయ్యారిభామ వదిలించుకుందామన్నా వదలని ఓ కలుపు మొక్క. ఏదో సినిమాలో చెప్పినట్టు మొక్కే కదా అని వదిలేస్తే ఆ వయ్యారిభామ ఇంతింతై ఒటుడింతై అన్నట్టు పంట పొలాలు, జనావాసాలు అన్న భేదం లేకుండా వ్యాపించి కబళించేస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా పెరిగి మనుషులు, మూగజీవాల ఆరోగ్యాన్ని చెడగొట్టేస్తుంది. నివారణ సాధ్యం కాని ఈ వయ్యారిభామ కలుపు మొక్క ప్రస్తుతం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఖరీఫ్ పనులు నిర్వహిస్తున్న అన్నదాతలను వయ్యారిభామ వెంటాడుతోంది. మడుల్లోని వయ్యారిభామను తొలగించినా పొలం గట్లు, మకాములు, జనావాసాల్లో ఏపుగా పెరిగి సవాల్ విసురుతోంది.

అనుకోని అతిథిలా వచ్చి..

వయ్యారిభామ కలుపు మొక్క అమెరికాలోని ఉష్ణ ప్రాంతాలలో పుట్టి 1956లో గోదుముల దిగుమతితో మన భారతదేశంలోకి అనుకోని అతిథిలా వచ్చి తిష్టవేసింది. 1973లో మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాలలో దీనిని గుర్తించగా ప్రస్తుతం భారతదేశం అంతటా వ్యాపించి నివారణ సాధ్యం కాని కలుపు మొక్కగా అవతరించింది.

వదిలేస్తే అంతా నష్టమే..

వయ్యారిభామ అత్యంత ప్రమాకరమైన కలుపుమొక్కగా మారి రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలగజేస్తోంది. ఇది ఎక్కడ పెరిగితే అక్కడ పంటల దిగుబడి బాగా తగ్గిపోతుంది. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే దీనిని వేళ్లతో సహా పెకిలించి సామూహికంగా తగలబెట్టాల్సి ఉంటుంది. లేదంటే దీని పూల పుప్పొడి రేణువులు కిలోమీటర్ల దూరం వేగంగా ప్రయాణించి మొక్కలు పుట్టుకొస్తాయి. ఇవి ఎక్కువగా పత్తి, మొక్కజొన్న, గోదుమ, మామిడి, కూరగాయల పంటల్లో వ్యాప్తి చెందుతాయి. జనావాసాల్లో కూడా విస్తారంగా పెరుగుతున్నాయి.

పీలిస్తే ప్రమాదమే..

వయ్యారిభామ కలుపు మొక్క పూల పుప్పొడి గాలిని పీలిస్తే మనుషులకు శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. ఈ మొక్కను తాకితే చర్మవ్యాధులు వస్తాయి. ఇక మూగజీవాలు తింటే జీర్ణక్రియ, కిడ్నీ, లివర్, గర్భాశయ వ్యాధులు, శ్వాసక్రియలు దెబ్బతిని మృతి చెందే ప్రమాదం ఉంది. సాధ్యమైనంత వరకు ఈ వయ్యారిభామను పూత రాక ముందే వేళ్లతో సహా పెకిలించి తగలబెట్టేయాల్సి ఉంటుంది. సామూహిక నిర్మూలనే దీనిని అంతమొందించే మార్గంగా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వయ్యారిభామ కలుపు మొక్కలు ఏపుగా పెరిగిపోయి ఉండడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. దీని నివారణకు ప్రభుత్వ సహకారం అవసరమని రైతులు అంటున్నారు. ఉపాధి హామీ పథకంలో దీనిని నివారణను చేర్చాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి హామీ పథకంతో నివారించండి



వయ్యారిభామ కలుపు మొక్కలు ప్రమాదకరంగా ఉన్నాయి. పొలాల్లోనే కాకుండా జనాలు తిరిగే ప్రాంతాలు, ఇళ్ల మధ్యలో కూడా ఏపుగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా పూతతో కనిపిస్తున్నాయి. ఈ కలుపు మొక్కల నివారణను ఉపాధి హామీ పథకంలో చేర్చాలి.

– పెట్ల రాంబాబు, ఎంపీటీసీ, బి.కె.పల్లి

అవగాహన తప్పనిసరి



వయ్యారిభామ కలుపుమొక్కలపై ప్రజలకు అవగాహన కలిప్పించాలి. ఇది చాలా ప్రమాకరమైన మొక్క. జనాలకు తెలియక ఈ మొక్కలతోనే సావాసం చేస్తున్నారు. పొలంబడి కార్యక్రమం ద్వారా వయ్యారిభామ కలుపుమొక్కపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. మొక్కల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేయాలి.

– పైల నాని, రైతు, కె.వెంకటాపురం

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గోపీనాథ్

పాయకరావుపేట: ప్రభుత్వం 117 జీవోని రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని పీఆర్‌టీయూ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ డిమాండ్ చేశారు. పాయకరావుపేటలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కాకుండా ఓపీఎస్ అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్జిత సెలవుల బకాయిలు విడుదల చేయాలన్నారు. 12వ పే రివిజన్ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్‌కు సమాంతరంగా తెలుగు మీడియంను ప్రవేశ పెట్టాలన్నారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సీబీఎస్‌ఈ విధానాన్ని పునరాలోచించాలన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్స్ వినియోగంపై పునరాలోచించాలని సూచించారు. ఈ సమావేశంలో పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల పీఆర్‌టీయూ అధ్యక్షులు ఎ.ప్రకాష్, ఆర్.వీరభద్రరావు, టి.వి.రమణ, టి.సత్యనారాయణ, బాషా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విజేతకు నేడు అభినందన

రోలుగుంట : బీబీపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గడిచిన విద్యా సంవత్సరంలో టెన్త్‌లో 565 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన హేమలతకు ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి తమ పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన కసిరెడ్డి హేమలతకు మంగళవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశామని, ఆహానితులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని హెచ్ఎం అప్పారావు విజ్ఞప్తి చేశారు.

‘ఫార్మా ప్రమాదాలన్నీ యాజమాన్యం హత్యలే’



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరరావు

మునగపాక(అచ్యుతాపురం): ఫార్మా ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫార్మాసిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలన్నీ యాజమాన్యం హత్యలే అన్నారు. అచ్యుతాపురం ఎసైన్షియా ఘటన మరువక ముందే పరవాడలోని సినర్జీస్‌లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు భద్రత, రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము, పార్టీ నాయకులు సోమునాయుడు, బుద్ద రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

జయకృష్ణా ముకుందా మురారి

- వేడుకగా జన్మాష్టమి
- కృష్ణుడికి విశేష పూజలు
- ఉత్సాహంగా ఉట్టి కొట్టే సంబరాలు



ఒంపోలులో శ్రీకృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



కోటవురట్లలో శ్రీకృష్ణుడి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు



ఎర్రవరంలో శ్రీకృష్ణుని ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోటవురట్ల: కృష్ణాష్టమి వేడుకలను సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. మండల కేంద్రం సినిమా హాలు రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో తుమ్మలపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో యువకులు ఉట్టి కొట్టే సంబరంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. లింగాపురం, గొల్లపేట, జి.సన్యాసిరాజుపాలెం, రామచంద్రపాలెం, ములగల్లోవ, గూడెపులోవ గ్రామాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి.

ఎస్.రాయవరం: మండలంలో కొత్తపోలవరం, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, కోనవానిపాలెం, గుర్రాజుపేట గ్రామాల్లో ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో యువకులు ఉట్టి కొట్టే సంబరం నిర్వహించి కేరింతలు కొట్టారు. సర్పంచ్ దూళి శ్రీనుబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, కొరుప్రోలు పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రం నానాజీ, దూళి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో దేవవరం, ఉపమాక, జానకయ్యపేట, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం, డీఎల్ పురం, వేంపాడు తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. దేవవరం రామాలయంలో శ్రీకృష్ణ గణపతి సంఘం, శ్రీకృష్ణదుర్గా యూత్ ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం మధ్యాహ్నం వందలాది మందికి అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఉట్టి సంబరం జరిపారు. విజేతలకు ముగింపు రోజు బుధవారం బహుమతుల ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం మహిళలతో భజన కార్యక్రమం సందడిగా సాగింది. కబడ్డీ పోటీలు, రామాలాయం వద్ద కోలాటం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ముకుందరాజుపేటలో ఏకాహం నిర్వహించారు.

నక్కపల్లిలో గోపూజ

నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం గోపూజ నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కోసూరు శ్రీను, సీఐ కుమారస్వామి, తాలూకా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి శ్రీపాద ప్రణవ్‌రామ్ పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలంలో హరిపురం, వెంకటాపురం, గోవిందపాలెం, సంతపాలెం, మూలజంప, మూలకొత్తూరు తదితర గ్రామాల్లో శ్రీకృష్ణుడి మందిరాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పలు గ్రామాల్లో సాయంత్రం ఉట్టి కొట్టే మహోత్సవంలో యువకులు పోటీపడి పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: పట్టణం, మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీకృష్ణుని ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కాకివాని వీధి, ఏటికొప్పాక, కొత్తలి, పురుషోత్తపురం, పులపర్తి, పీఎస్‌ఆర్ పేట, ఎర్రవరం, గొల్లలపాలెం, జంపపాలెం తదితర గ్రామాల్లో యాదవ సామాజిక వర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పూజలు చేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో రాత్రి ఉట్టి కొట్టే సంబరం వేడుకగా జరిపారు. యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, వార్డు కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దూది నర్సింహమూర్తి, గొర్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. పలుచోట్ల చిన్ని కృష్ణుని వేషధారణలో చిన్నారులు అలరించారు.

మునగపాక(అచ్యుతాపురం): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. అచ్యుతాపురం, మోసాయ్యపేట, ఎర్రవరం, జగన్నాథపురం, వెదురువాడ, తదితర గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీకృష్ణ విగ్రహాలను దర్శించుకున్నారు. పలు స్కూళ్లలో చిన్నారుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మునగపాక: స్థానిక సంతబయలులో శ్రీబాలల యువజన సంఘం, బీసీ కాలనీలో యువకుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గవర్ల అనకాపల్లి, నారాయుడుపాలెం, రామగిరి తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఒంపోలులో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని బృందావనంలో కృష్ణుని విగ్రహం వద్ద బాలికల కోలాటం ఆకట్టుకుంది. అనంతరం ఉట్టి కొట్టే వేడుక నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని కృష్ణ మందిరాల్లో భక్తులు పూజలు చేశారు.



దేవవరంలో పూజలు చేస్తున్న భక్తులు



దేవవరంలో ఉట్టి కొట్టే సంబరంలో యువకుల సందడి



అచ్యుతాపురంలో చిన్నారుల వేషధారణలు



మునగపాకలో శ్రీకృష్ణుని విగ్రహం ఊరేగింపు




గవర్ల అనకాపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



బృందావనంలో బాలికల కోలాటం


పంట పొలాలు పచ్చగా...



కె.కోటపాడు-సింగన్నదొరపాలెం మధ్య పచ్చగా కనిపిస్తున్న వరినాట్లు పూర్తయిన పొలాలు

కె.కోటపాడు : కె.కోటపాడు-సింగన్నదొరపాలెం గ్రామాల మధ్య రోడ్డును ఆనుకొని ఉన్న పంటపొలాలు వరినాట్లు పూర్తి కావడంతో పచ్చగా కళకళలాడుతున్నాయి. వర్షాలతో పాటు కె.కోటపాడు పైడమ్మ చెరువులో నీరు ఉండడంతో ఆయకట్టు పరిధిలో గల పొలాల్లో నాట్లు పూర్తయ్యాయి. దీంతో కనుచూపు మేరలో గల పొలాలన్నీ వరినాట్లతో పచ్చదనంతో పరుచుకున్నట్లుగా చూపరులను ఆకట్టుకుంటోంది.

ఎమ్మెల్సీ బొత్సకు పడాల అభినందనలు



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న అప్పలనాయుడు

మాడుగుల రూరల్ : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల నుంచి ఏకగ్రీవంగా శాసనమండలికి ఎన్నికైన బొత్స సత్యనారాయణను ఎం.కోడూరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, గ్రామశాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు సోమవారం విశాఖలో కలిశారు. సత్యనారాయణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఎంపిక కావడం పట్ల అభినందనలు తెలిపారు.

ఎంపీటీసీ నిధులతో అభివృద్ధి పనులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరులో స్థానిక ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు తన ఎంపీటీసీ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఒక లక్ష రూపాయల వ్యయంతో దుర్గాలమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పాటు రెండు చోట్ల సీసీ రోడ్లు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎంపీటీసీ రమణబాబు తెలిపారు. ఈ పనుల పర్యవేక్షణలో వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ గెంజి రాజేష్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ రాములమ్మ

అనకాపల్లి: సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో మదర్ థెరిసా 115 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి. రాములమ్మ మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎన్నో లక్షల మంది అభాగ్యులకు, కుష్ఠిరోగులకు విశేష సేవలందించిన గొప్ప మహానీయురాలు మదర్ థెరిసా అని కొనియాడారు. ఈమె సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశ అత్యున్నత పురస్కారం భారత రత్నతో గౌరవించిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.